

టమాట కిలో రూ.8

అనంతపురం కక్కలపల్లి మండీలో ఆదివారం కిలో టమాట గరిష్ట ధర రూ.8 పలికింది. కనిష్టం రూ.4, సరాసరి రూ.6 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.



ఇన్‌చార్జ్‌ల ఏలుబడి.. ప్రగతి వెనుకబడి

ఉమ్మడి జిల్లాలో 18 మండలాలకు పాలనాధికారులు లేకపోవడంతో ప్రగతి పనులు సరిగా సాగడం లేదు.

8లో

గరిష్టం/కనిష్టం

32.7°/17.7°

జిల్లా అంతటా ఆదివారం చలి వాతావరణం నెలకొంది. ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఈశాన్యం దిశగా గంటకు 6 నుంచి 8 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

న్యూస్‌రీల్

ధాబాలో గంజాయి, హస్క్ స్వాధీనం



స్వాధీనం చేసుకున్న గంజాయి, హస్క్‌ను చూపుతున్న ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు

చిలమత్తూరు: మండల పరిధిలోని 44వ నంబరు జాతీయ రహదారి కంబాలపల్లి క్రాస్ సమీపంలో గల రాజస్థానీ ధాబాలో 410 గ్రాముల గంజాయి ప్యాకెట్లు, 8.9 కిలోల ఓపియం పాపీ హస్క్ (గసగసాల పొట్టు)ను ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ధాబాలో గంజాయి విక్రయిస్తున్నారన్న సమాచారం మేరకు ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు ఆదివారం దాడులు నిర్వహించారు. 11 ప్యాకెట్ల గంజాయితో పాటు 8.9 కిలోల పాపీ హస్క్ పట్టుబడింది. దీంతో ధాబా నిర్వాహకులు మంగల్‌రామ్, ఇంద్రజిత్, ధన్‌రామ్‌లను అదుపులోకి తీసుకొన్నారు. నిందితులపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎక్సైజ్ సీఐ లక్ష్మీ దుర్గయ్య తెలిపారు. కార్యక్రమంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ అలీబేగ్, ఎస్‌ఐలు పృథ్వీ, ఫరూక్, వీఆర్‌ఓలు అశ్వర్థనారాయణ, రామాంజిప్ప, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

సత్యసాయి సన్నిధిలో రాజస్థాన్ సాంస్కృతిక వైభవం



సత్యసాయి అష్టోత్తర శత నామావళి నిర్వహిస్తున్న రాజస్థాన్ సత్యసాయి భక్తులు

ప్రశాంతి నిలయం: పర్తి యాత్రలో భాగంగా పుట్టపర్తి ప్రశాంతి నిలయానికి విచ్చేసిన రాజస్థాన్ సత్యసాయి భక్తులు సాంస్కృతిక వైభవం చాటారు. ఆదివారం ఉదయం సాయి కుల్వంత్ సభా మందిరంలో సత్యసాయి మహాసమాధి చెంత సత్యసాయి అష్టోత్తర శత నామావళి నిర్వహించారు. వెయ్యి మంది భక్తులు సామూహికంగా నిర్వహించిన శత నామావళితో సాయికుల్వంత్ సభా మందిరం మార్మోగింది. సాయంత్రం రాజస్థాన్ సత్యసాయి యూత్ బృందం సత్యసాయి విద్యాసంస్థల ప్రాధాన్యతను, దేశ విద్యా వ్యవస్థలో తీసుకొస్తున్న మార్పులను వివరిస్తూ ప్రదర్శించిన నాటిక అలరించింది.

అబ్బేదొడ్డిలో చిరుత సంచారం

గుత్తి రూరల్: మండలంలోని అబ్బేదొడ్డి గ్రామ శివారులో చిరుత సంచరిస్తూ రైతులకు, గ్రామస్తులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తోంది. శనివారం రాత్రి ద్విచక్ర వాహనంపై గ్రామానికి చేరుకుంటున్న రైతు దంపతులు... చెరువు వద్ద నీరు తాగి బయటకు వస్తున్న చిరుతను గమనించి వేగంగా దూసుకెళ్లిపోయారు. అదే రోజు మధ్యాహ్నం ఓ రైతు పొలంలో పనులు చేసుకుంటూ ఉండగా అక్కడికి సమీపంలో నుంచే చిరుత వెళ్లింది. ఈ ఘటనలపై భయభ్రాంతులకు గురైన రైతులు సమాచారం అందిస్తే అటవీ శాఖ అధికారులు స్పందించడం లేదని స్థానికులు వాపోయారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చిరుతను బంధించేందుకు బోను ఏర్పాటు చేయాలని కోరారు. కాగా, ఆదివారం ఉదయం అటవీశాఖ చిరుద్యోగి ఒకరు గ్రామానికి చేరుకుని చిరుత పాద ముద్రలను గుర్తించారు.

కాపాడితే.. పాడె కట్టారు!

కూటమి ప్రభుత్వంలో పాడి రైతుల వేదన వర్ణనాతీతంగా మారింది. పాల దిగుబడి లేక రైతులు నష్టపోతున్నారు. పాడి పరిశ్రమలు మూతపడే స్థితికి చేరుకుంటున్నాయి. పాడి రైతుల సంక్షేమానికి వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పెద్దపీట వేసి అడుగడుగునా చేయూత అందించగా.. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక సీఎం చంద్రబాబు ఇప్పటివరకూ కనీసం ఒక్క పథకం కూడా అమలు చేయకపోవడంతో పరిస్థితి దారుణంగా తయారైంది.

- భారమవుతున్న పశు పోషణ
- దారుణంగా పాడి రైతుల పరిస్థితి
- కనికరించని కూటమి ప్రభుత్వం
- ఒక్క పథకమూ అమలు చేయని వైనం
- వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అడుగడుగునా చేయూత



గుమ్మఘట్టలో పశుసంపద



ట్రాక్టర్లలో విక్రయానికి తీసుకొచ్చిన ఎండుగడ్డి

జిల్లాలో పశుసంపద	
ఆవులు	2,15,896,
గేదెలు	1,89,843
మొత్తం	4,05,739

అనంతపురం అగ్రికల్చర్/రాయదుర్గం: వ్యవసాయానికి ప్రధాన ప్రత్యామ్నాయంగా ఉన్న పశుసంవర్ధకశాఖను కూటమి సర్కారు చిన్నచూపు చూస్తోంది. పశుశాఖ పరిధిలో ఎలాంటి పథకాలూ అమలు చేయడం లేదు. దీంతో పాడి, పశుపోషణ, జీవాల పెంపకందారుల పరిస్థితి దారుణంగా మారింది. అటు పశుశాఖ అధికారులు సైతం పని లేక ఉత్తుత్తి కార్యక్రమాలతో కాలం వెళ్లదీస్తున్నారు. వ్యాక్సినేషన్ కార్యక్రమాలు, పశువైద్యం మినహా ఆ శాఖలో పాడి రైతులు, జీవాల కాపర్ల సంక్షేమానికి ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు.

అడుగడుగునా చేయూత..

గత ఐదేళ్లలో అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అడుగడుగునా పాడి రైతులకు చేయూత అందించారు. షెడ్యూల్ ప్రకారం వ్యాక్సినేషన్లు చేపట్టారు. సీజనల్, అంటువ్యాధులు ప్రబలకుండా పటిష్ట చర్యలు తీసుకున్నారు. పార్టీలకు అతీతంగా ఏటా 150 నుంచి 200 మందికి చాఫ్‌కట్టర్స్, టీఎంఆర్ గడ్డి, 100 నుంచి 150 టన్నుల వరకు గడ్డి విత్తనాలు (ఫాడర్ సీడ్) రాయితీతో అందించారు. పశువైద్యానికి ఇబ్బంది లేకుండా రూ.కోట్లు విలువ చేసే అత్యవసర మందులు, వైద్య సామగ్రి ప్రతి మూడు నెలలకోసారి పశువుల ఆస్పత్రులకు సరఫరా చేశారు. గిర్, సాహివాల్, ఒంగోలు, పుంగనూరు లాంటి స్వదేశీ పశుజాతుల అభివృద్ధికి చేయూను అందించారు. పెయ్యదూడల సంతానోత్పత్తి లక్ష్యంగా కృత్రిమ గర్భోత్పత్తి, లింగనిర్ధారణ వీర్యం అందించారు. దేశంలో తొలిసారిగా 1962 హెల్ప్‌లైన్ ద్వారా నియోజకవర్గానికి రెండు చొప్పున మొబైల్ వెటర్నరీ అంబులెన్స్‌లు ఏర్పాటు చేసి మారుమూల ప్రాంతాలకు సైతం పశువైద్యాన్ని దరిచేర్చారు. దీని కింద ఎన్నో అరుదైన, కష్టసాధ్యమైన శస్త్రచికిత్సలు విజయవంతంగా నిర్వహించి పశు సంపదను కాపాడారు. అలాగే వైఎస్సార్ పశునష్ట పరిహారం పథకం అమలు కింద చనిపోయిన పశువులు, జీవాలకు సంబంధించి రైతులు, కాపర్లకు రూ.5 కోట్ల వరకు ఉచితంగా బీమా పరిహారం అందజేశారు. పాడి రైతులకు గిట్టుబాటు ధర దక్కేలా అంతర్జాతీయ స్థాయిలో పేరున్న 'అమూల్' ద్వారా పాల సేకరణ చేపట్టారు.

అంతులేని నిర్లక్ష్యం..

సీఎం చంద్రబాబు నేతృత్వంలో కూటమి సర్కారు కొలువుతీరి ఆరు నెలలు పూర్తయినా పశుశాఖకు బడ్జెట్, పథక నిర్దేశన చేయలేదు. కనీసం పశువైద్యానికి మందులు కూడా ఇప్పటిదాకా సరఫరా చేయలేదు. జిల్లా అంతటికీ కలిపి కేవలం 20 చాఫ్ కట్టర్స్ (గడ్డి కత్తిరించే పరికరాలు) కేటాయించగా అవన్నీ టీడీపీ నాయకులకే సరిపోవడం లేదంటున్నారు. పశుదాణా లేదు, టీఎంఆర్ (దాణామృతం) లేదు, గడ్డి విత్తనాలు కూడా ఇవ్వడం లేదని రైతులు వాపోతున్నారు. పశువుల షెడ్లు పూర్తిగా 'పసుపుబిళ్ల' కలిగిన వారికే ఇచ్చేశారు. పాడి రైతులు, జీవాల కాపర్లకు ఉపయోగపడేలా ఒక చిన్న పథకం కూడా అమలు చేయకుండా కూటమి సర్కారు శీతకన్ను వేయడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

గ్రాసం కష్టాలు..

ఇటీవల గ్రాసం కొరత పాడి రైతులను తీవ్రంగా వేధిస్తోంది. ఒక గేదె లేదా ఆవుకు ఏడాదికి రెండున్నర ఎకరాల్లోని వరి గడ్డి అవసరం అవుతుంది. గేదె/ఆవు సరాసరి 150 లీటర్ల పాలు ఇస్తుంది. కూలీల రేట్లు పెరగడంతో రైతులు వరి మళ్లను యంత్రాలతోనే కోస్తున్నారు. ఈ కారణంగా గడ్డి కొరత తీవ్ర రూపం దాల్చింది. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం కిలో గడ్డి రూ.15.80 కాగా రైతులకు సబ్సిడీపై రూ.6.50కే అందించి ఆదుకుంది. ప్రతి పాడి రైతుకు రెండు నెలలకు ఒకసారి 60 శాతం రాయితీపై గరిష్టంగా 1,800 కిలోల చొప్పున స్థానిక ఆర్‌బీకేల్లోనే పంపిణీ చేసి ఎలాంటి కష్టాలు లేకుండా చూశారు. ప్రస్తుత కూటమి సర్కార్ ఆ దిశగా చర్యలు చేపట్టకపోవడంతో పాడి రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

దాణా పంపిణీ చేయాలి



వరి మళ్లను యంత్రాలతో కోత కోస్తున్నారు. దీంతో గ్రాసం కొరత తలెత్తుతోంది. వేసవిలో మరిన్ని ఇబ్బందులు తప్పేలా లేవు. గత ప్రభుత్వంలో పంపిణీ చేసిన టీఎంఆర్ సమీకృత దాణా రైతులకు ఎంతో ఉపయోగపడింది. చంద్రబాబు ప్రభుత్వం కూడా స్పందించి దాణా పంపిణీ చేయాలి. – నాగేంద్రప్ప, కలుగోడు, గుమ్మఘట్ట మండలం

గడ్డి విత్తనాలు సరఫరా చేయాలి



పశుసంవర్ధక, ఉపాధి పథకం ద్వారా అర్హత కలిగిన రైతులందరికీ వంద శాతం రాయితీతో గడ్డి విత్తనాలు అందించాలి. ఇప్పటి నుంచి పెంచితేనే వేసవిలో గ్రాసం కష్టాల నుంచి కొంత వరకైనా గట్టెక్కవచ్చు. ప్రభుత్వం ఈ దిశగా చర్యలు తీసుకోవాలి.

– గొల్ల నాగరాజు, రైతు, కేపీదొడ్డి

పీఏసీఎస్ ఈకేవైసీకి ప్రత్యేక డ్రైవ్



ఇన్‌చార్జ్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ

అనంతపురం అర్బన్: ప్రాథమిక సహకార సంఘాల(పీఏసీఎస్) సభ్యుల ఈకేవైసీ కోసం ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలని ఇన్‌చార్జ్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ జిల్లా కో–ఆపరేటివ్ అధికారి అరుణకుమారిని ఆదేశించారు. కేంద్ర ప్రాయోజిత పథకం పీఏసీఎస్ కంప్యూటరైజేషన్‌లో భాగంగా రికార్డుల్లో ఈకేవైసీ వివరాలను నవీకరించాలన్నారు. ఇందుకు మిషన్ మోడ్‌లో డ్రైవ్ చేపట్టాల్సి ఉందన్నారు. కంప్యూటరైజేషన్‌లో భాగంగా సహకార సంఘాల సభ్యులందరూ ఈకేవైసీ చేయించుకునేలా చర్యలు తీసుకోవాలని సహకార సంఘాల కమిషనర్ నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయన్నారు. జనవరి 1వ తేదీ తరువాత రుణాలతో సహా అన్ని పీఏసీఎస్ సేవలు ఆన్‌లైన్‌లో ఉంటాయన్నారు. అటు తరువాత సభ్యులు ఈకేవైసీ లేకుండా ఎలాంటి లావాదేవీలు చేయలేరన్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని జిల్లాలోని అన్ని సహకార సంఘాల సభ్యులందరూ సంబంధిత సచివాలయాల్లో ఈకేవైసీ చేసుకోవాలని సూచించారు. భవిష్యత్తులో సహకార సంఘాల ద్వారా ప్రభుత్వం చేపట్టబోయే కార్యక్రమాలకు సంఘాల సభ్యులకు ఇబ్బందులు రాకుండా చూడడమే ఈకేవైసీ ఉద్దేశమన్నారు. వీలైనంత త్వరగా ఈ ప్రక్రియను పూర్తిచేసుకోవాలని సూచించారు. క్షేత్రస్థాయిలో ప్రక్రియ సజావుగా జరిగేలా చర్యలు తీసుకోవాలని డీసీఓని ఆదేశించారు.

రైలు కింద పడి యువకుడి మృతి

గార్లదిన్నె: మండలంలోని కల్లూరు రైల్వేస్టేషన్ సమీపంలో శనివారం రాత్రి ఓ యువకుడు రైలు కింద పడి మృతి చెందాడు. ఆదివారం ఉదయం అటుగా వెళ్లిన స్థానికులు గుర్తించి సమాచారం ఇవ్వడంతో రైల్వే పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. మృతుడిని శింగనమల మండలం కల్లుమడి గ్రామానికి చెందిన చలపతి (25) గుర్తించారు. మృతికి కారణాలు తెలియాల్సి ఉంది. ఘటనపై రైల్వే పోలీసులు కేసు నమోదు చేశారు.

మహిళలపై పెరిగిన నేరాలు



మాట్లాడుతున్న ఎస్పీ జగదీష్, చిత్రంలో ఏఎస్పీలు, డీఎస్పీలు

- 2023 కంటే 2024లో హత్య కేసులు అధికం
- హత్యాయత్నాలు, కిడ్నాప్ తదితర కేసులూ ఎక్కువగానే
- ఎస్పీ జగదీష్

అనంతపురం: జిల్లాలో గత ఏడాదితో పోల్చితే ఈ ఏడాది మహిళలపై నేరాలు పెరిగాయి. చోరీ కేసులు జిల్లావ్యాప్తంగా 529 నమోదు కాగా, కేవలం 289 కేసులను మాత్రమే ఛేదించారు. రూ.7.31 కోట్లను ప్రజలు పోగొట్టుకోగా, ఇందులో రూ.3.76 కోట్లు మాత్రమే రికవరీ అయింది. ఈ ఏడాదిలో జరిగిన నేరాలు, రికవరీలు, పోలీసుల పనితీరును జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ జగదీష్ ఆదివారం మీడియాకు వెల్లడించారు. ఎన్నికల సందర్భంగా పోలీసులు కట్టుదిట్టంగా పనిచేయడంతో అక్రమ మద్యం, గ్యాంబ్లింగ్, ఇసుక అక్రమ రవాణా కేసులు అధికంగా నమోదయ్యాయన్నారు. 2023 కంటే 2024లో హత్యలు, హత్యాయత్నాలు, కిడ్నాప్ తదితర కేసులు ఎక్కువగా నమోదైనట్లు చెప్పారు. ఈ తరహా కేసులు 2023లో 956 నమోదు కాగా, 2024లో 1,051 నమోదు అయ్యాయని వెల్లడించారు. జిల్లా కేంద్రంతో పాటు పట్టణాల్లోని శివారు ప్రాంతాల్లో డ్రోన్లతో నిఘా పటిష్టం చేశామన్నారు. శాంతిభద్రతల పరిరక్షణకు చిత్తశుద్ధితో కృషి చేశామని ఎస్పీ పి. జగదీష్ పేర్కొన్నారు. ఆయన తెలిపిన మేరకు..

- జిల్లాలో అనంతపురం నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్, కూడేరు, గార్లదిన్నె పోలీస్‌స్టేషన్ల పరిధిలో జరిగిన ఏటీఎం సెంటర్స్‌లో దొంగతనాలను పోలీసులు ఛేదించారు. సాంకేతిక పరిజ్ఞానం వినియోగించడంతో పాటు సీసీ పుటేజీలను విశ్లేషించి హర్యానా, రాజస్థాన్ రాష్ట్రాలకు చెందిన ఐదుగురు అంతర్రాష్ట్ర ముఠాను అరెస్ట్ చేశారు.
- మహిళలకు సంబంధించిన వరకట్న వేధింపులు, గృహ హింస కేసులు స్వల్పంగా పెరిగాయి. ఈ ఏడాది మిస్సింగ్ కేసులు తగ్గాయి. పోక్సో కేసులు కూడా 8 శాతం తగ్గాయి. మహిళా సంబంధిత నేరాలపై తక్షణమే స్పందించి కేసులు కడుతున్నారు.

రక్తమోడిన రహదారులు..

జిల్లాలో 294 రోడ్డు ప్రమాదాలు జరిగాయి. గార్లదిన్నె సమీపంలో తలగాచిపల్లి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో 8 మంది మరణించారు. శింగనమల మండలంలోని నాయనపల్లి క్రాస్ వద్ద ఇస్కాన్ భక్తులు ఆరుగురు రోడ్డు ప్రమాదంలో మరణించారు. బుక్కరాయసముద్రం మండలం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురు స్నేహితులు మృత్యువాత పడ్డారు.

- పుట్లూరు మండలం కోమటిగుంట్లలో టీడీపీ నాయకులు బండరాళ్లతో వైఎస్సార్‌సీపీ నాయకుడు ఎరికలయ్యను జూన్ 27న పాశవికంగా హత్య చేశారు. టీడీపీ నాయకుల దాడిని అడ్డుకోవడంతో ఎరికలయ్యను బండరాళ్లతో మోది చంపారు.
- 2024లో 55 హత్యలు జరిగాయి. 65 మందిపై హత్యాయత్నం జరిగింది. 29 మందిని కిడ్నాప్ చేశారు.
- 726 మంది మహిళలు అదృశ్యం కాగా, 638 మంది ఆచూకీని కనిపెట్టారు.
- 2024లో సైబర్ క్రైం ద్వారా రూ.1.76 కోట్లు బాధితులు నష్టపోయారు.
- లోక్ అదాలత్‌లో 10,933 కేసులు పరిష్కారమయ్యాయి.

- ఈ ఏడాది వివిధ కేసుల్లో నిందితులకు కఠిన కారాగార శిక్షలు పడ్డాయి. మొత్తం 77 కేసుల్లో శిక్షలు విధిస్తూ తీర్పులు వచ్చాయి. వీటిలో రెండు జీవిత కాలాల శిక్ష పడిన ఖైదీలు 11 మంది, పది సంవత్సరాల జైలు శిక్షలు ఇద్దరికి, ఐదు సంవత్సరాల జైలు శిక్షలు ముగ్గురికి, మూడు సంవత్సరాల జైలు శిక్షలు 59 మందికి పడ్డాయి. 17 మంది పిల్లలకు ఆపరేషన్ స్వేచ్ఛ కింద పని నుంచి విముక్తి కల్పించారు.

అధిక వడ్డీ ఆశ చూపి.. నిండా ముంచి



కళ్యాణదుర్గం రూరల్ పోలీస్ స్టేషన్‌కు వచ్చిన బాధితులు

- రూ. 5 కోట్ల అప్పులు చేసి ఉడాయించిన అన్నాతమ్ముడు
- ఏకంగా 150 మందికి కుచ్చుటోపీ

కళ్యాణదుర్గం రూరల్: అధిక వడ్డీ ఆశ చూపి నిండా ముంచారు ఘరానా అన్నాతమ్ముళ్లు. దీంతో బాధితులు లబోదిబోమంటున్నారు. వివరాలు.. కళ్యాణదుర్గం మండలంలోని బాల వెంకటాపురం గ్రామానికి చెందిన ఖాసీం వలి, ఇమామ్ వలి అన్నాతమ్ముళ్లు. అదే గ్రామానికి చెందిన దాదాపు 150 మందికి అధిక వడ్డీ ఆశ చూపి రూ.5 కోట్ల అప్పు తీసుకున్నారు. మొదట్లో ఇచ్చిన అప్పును చెప్పినట్లుగానే చెల్లించడంతో చాలా మంది డబ్బు సమర్పించుకున్నారు. ఈ క్రమంలోనే నాలుగు నెలల క్రితం ఖాసీం వలి, ఇమామ్ వలీలు తమ కుటుంబసభ్యులతో కలిసి అనంతపురానికి మకాం మార్చారు. అప్పు ఇచ్చిన వారందరికీ ఐపీ నోటీసులు పంపారు. దీంతో బాధితులు తమకు న్యాయం చేయాలంటూ ఆదివారం కళ్యాణదుర్గం రూరల్ పోలీసుస్టేషన్‌కు వచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తాము ఇచ్చిన సొమ్ముతో ఖాసీం, ఇమామ్‌లు 2 కేజీల వరకూ బంగారం, అనంతపురంలో ఇళ్లు, ప్లాట్లు కొన్నారని వాపోయారు. అప్పు ఇచ్చిన వారిలో అధిక శాతం రైతులు, గొర్రెల కాపరులు, డ్వాక్రా మహిళలు, కూలీలు ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పలువురు కన్నీరుమున్నీరయ్యారు. పోలీసులే తమకు న్యాయం చేయాలని కోరారు.



అన్నదమ్ములు ఖాసీం వలి, ఇమామ్ వలి (ఫైల్)

● దిగుబడి 'వెలిగి'పోవాలని..



ఎల్‌ఈడీ బల్బుల కాంతుల్లో చామంతి పంట

పెద్దపప్పూరు: చామంతి పంట సాగులో ఆశించిన దిగుబడి సాధించాలనే లక్ష్యంతో ఓ రైతు తన పొలంలో ఎల్‌ఈడీ బల్బులను ఏర్పాటు చేయడం ఆకట్టుకుంటోంది. పెద్దపప్పూరు చితంబరస్వామి కాలనీకి చెందిన రైతు సూర్యనారాయణ నాలుగు ఎకరాల్లో చామంతి పూలు సాగు చేస్తున్నాడు. చామంతి మొక్క ఎదుగుదల దశలోనే మొగ్గలు వస్తే ఆశించిన దిగుబడి రాదని పలువురు రైతులు సూర్యనారాయణకు చెప్పారు. పంట చుట్టూ ఎల్‌ఈడీ బల్బులు ఏర్పాటు చేస్తే కాంతి ప్రభావంతో మొగ్గలు రావని తెలిపారు. మొక్క నాటినప్పటి నుంచి 40 రోజులు ఏర్పాటు చేయాలని సూచించారు. దీంతో సూర్యనారాయణ పంట చుట్టూ ఎల్‌ఈడీ బల్బులను ఏర్పాటు చేశారు. రోడ్డు పక్కనే పొలం ఉండటంతో రాత్రిళ్లు కొత్త అనుభూతి కలుగుతోంది. అటువైపు వెళ్లే వాహనదారులు ఆశ్చర్యంతో చూస్తున్నారు. రైతు ఆలోచన భలేగా ఉందని, దిగుబడి బాగా వచ్చి లాభాలు కూడా మంచిగా రావాలని కోరుకుంటున్నారు.

'కల' నెరవేర్చుకోవాలని..

కానిస్టేబుల్ దేహదారుఢ్య పరీక్షలకు సమయం దగ్గర పడింది. సోమవారం (నేడు) నుంచి వచ్చే నెల 17 వరకూ అనంతపురంలోని నీలం సంజీవరెడ్డి స్టేడియంలో ప్రక్రియ జరగనుంది. ఈ క్రమంలో కానిస్టేబుల్ అభ్యర్థులు తీవ్రంగా కసరత్తు చేస్తున్నారు. పోటీలో ఎలాగైనా సత్తా చాటాలని శ్రమిస్తున్నారు. దేహదారుఢ్య పరీక్షలకు పురుష అభ్యర్థులు 5,242, మహిళా అభ్యర్థులు 1,237 మంది మొత్తం 6,479 మంది హాజరుకానున్నారు. ఇప్పటికే పోలీసులు అన్ని ఏర్పాట్లు చేశారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం



సీరియస్‌గా కసరత్తు చేస్తున్న యువతి



అనంతపురం ఆర్ట్స్ కళాశాల మైదానంలో లాంగ్ జంప్ చేస్తున్న అభ్యర్థులు



రన్నింగ్ ప్రాక్టీస్ చేస్తున్న దృశ్యం

క్లుప్తంగా

మద్యం విక్రేత అరెస్ట్



స్వాధీనం చేసుకున్న కర్ణాటక మద్యంతో ఎక్సైజ్ అధికారులు

గుంతకల్లు టౌన్: బళ్లారి నుంచి గుంతకల్లుకు అక్రమంగా తరలిస్తున్న 960 టెట్రా ప్యాకెట్ల కర్ణాటక మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ సీఐ జి.శివసాగర్ తెలిపారు. అందిన సమాచారం మేరకు అప్రమత్తమైన ఎక్సైజ్ అధికారులు ఆదివారం ఉదయం గుంతకల్లు శివారున బళ్లారి రోడ్డులోని ప్రార్థనా మందిరం వద్ద వాహన తనిఖీలు చేపట్టారన్నారు. ఆ సమయంలో అటుగా వచ్చిన ద్విచక్ర వాహనదారుడిని అడ్డుకుని పరిశీలిస్తే కర్ణాటక మద్యం టెట్రా ప్యాకెట్లు లభ్యమయ్యాయన్నారు. మద్యం తరలిస్తున్న బళ్లారి జిల్లా హగరి బొమ్మనహల్లి గ్రామానికి చెందిన క్యామన్నను అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించామన్నారు.

ఎస్‌ఐ నాగవీరయ్య మృతి



ఎస్‌ఐ నాగవీరయ్య (ఫైల్)

తాడిపత్రి టౌన్: స్థానిక ట్రాఫిక్ పీఎస్‌లో ఎస్‌ఐగా పనిచేస్తున్న నాగవీరయ్య (60) కన్నుమూశారు. అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన మూడు రోజుల క్రితం విధులు నిర్వర్తిస్తూనే కళ్లు తిరిగి కిందపడిపోయారు. దీంతో స్టేషన్ సిబ్బంది వెంటనే స్థానిక ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. వైద్యుల సూచన మేరకు కుటుంబసభ్యులు అనంతపురంలోని ఓ కార్పొరేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్సకు స్పందించక ఆదివారం ఆయన మృతి చెందారు.

ఆచూకీ తెలిస్తే చెప్పండి



గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

గుంతకల్లుటౌన్: స్థానిక రైల్వే డివిజన్ పరిధిలోని బేవినహాళ్ రైల్వే స్టేషన్‌లో ఆదివారం మధ్యాహ్నం గూడ్స్ రైలు కిందపడి ఓ గుర్తుతెలియని వ్యక్తి మరణించాడు. ఈ మేరకు జీఆర్పీ ఎస్‌ఐ మహేంద్ర వెల్లడించారు. 45 నుంచి 50 ఏళ్ల మధ్య వయసున్న వ్యక్తి మృతదేహం వద్ద ఆచూకీ తెలిపే ఎలాంటి ఆధారాలు లభ్యం కాలేదు. మృతుడి ఆచూకీ తెలిసిన వారు 98661 44616కు సమాచారం అందించాలని రైల్వే పోలీసులు కోరారు.

రహ‘దారుణం’

నేషనల్ హైవే-44లో సురక్షిత ప్రమాణాలు పాటించడంలో అధికారులు బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తున్నారు. అనంతపురం రూరల్ మండలం తడకలేరు సమీపంలో హైవేపై డివైడర్లు దెబ్బతిన్నా మరమ్మతు చేయించడం మరిచిపోయారు. పొరపాటున డివైడర్లను తాకితే ప్రాణాలకే ప్రమాదం తలెత్తే అవకాశం ఉంది. దీంతో పాటు సూచిక బోర్డులు అధ్వాన స్థితికి చేరినా కొత్తవి ఏర్పాటు చేయలేదు. ఇప్పటికైనా అధికారులు మేలుకుని సరిచేయాల్సి ఉంది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం





డివై'డర్': దెబ్బతిని రోడ్డుపై పడిన డివైడర్ కడ్డీలు, పక్కనే వాహనాలు వెళ్తున్న దృశ్యం



సూచిక ఏదీ..?

ఇన్‌చార్జ్‌ల ఏలుబడి..

ప్రగతి వెనుకబడి

పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిలో ఎంపీడీఓల పాత్ర కీలకం. అంతటి ప్రాధాన్యత కలిగిన ఎంపీడీఓ పోస్టుల్లో అర్హులు లేక ఇన్‌చార్జ్‌లతో కాలం నెట్టుకొస్తున్నారు. అది కూడా ఏఓలు, ఈఓఆర్‌డీలకు మండలాల బాధ్యతలు అప్పగించారు. రెండు, మూడు మండలాలు కలిపి ఒకరి చేతిలో పెట్టేశారు. ఫలితంగా కొందరు నియోజకవర్గాలు దాటి ఇతర ప్రాంతాలకు పోవట్లేదు. మరికొందరిపై విపరీతమైన అవినీతి ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇంకొందరు నియంతల్లా వ్యవహరిస్తున్నారనే విమర్శలూ ఉన్నాయి.

- ఉమ్మడి జిల్లాలో 18 మండలాలకు లేని పాలనాధికారులు
- ఏఓలు, ఈఓఆర్‌డీలతో నెట్టుకొస్తున్న సర్కారు
- కొన్ని చోట్ల రెండు, మూడు మండలాలకు ఒక్కో ఎంపీడీఓ

అనంతపురం సిటీ: ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మొత్తం 63 మండలాలు ఉండగా ఒక్కో మండలానికి ఒక్కొక్కరు చొప్పున అంతే సంఖ్యలో ఎంపీడీఓలు కూడా ఉండాలి. అయితే 18 మండలాలకు ఎంపీడీఓలు లేరు. అందులో ఎనిమిది మండలాలకు అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్లు(ఏఓలు) ఇన్‌చార్జ్ ఎంపీడీఓలుగా వ్యవహరిస్తుండగా, ఐదు మండలాలకు ఈఓఆర్‌డీలు, మరో ఐదు మండలాలకు పక్క మండలాల ఎంపీడీఓలకు అదనపు బాధ్యతలు అప్పగించారు. అనంతపురం జిల్లా పరిధిలో ఆరు మండలాలకు రెగ్యులర్ ఎంపీడీఓలు లేరు. శ్రీసత్యసాయి జిల్లాలో 12 మండలాలకు ఇన్‌చార్జ్ ఎంపీడీఓలే దిక్కయ్యారు.

అవినీతి ఆరోపణలున్నా.. అందలం..

ఇన్‌చార్జ్ ఎంపీడీఓలుగా వ్యవహరిస్తున్న 18 మందిలో కొందరిపై వివిధ రకాల అవినీతి ఆరోపణలున్నాయి. అయినా వారికే ఎంపీడీఓలుగా పెత్తనం కట్టబెట్టారు. కొందరు ఏళ్ల తరబడి ఒకే నియోజకవర్గంలో తిష్ట వేసిన వారూ ఉన్నారు. వీరు గ్రామాల అభివృద్ధి కంటే అక్రమ సంపాదనపై మోజు కనబరుస్తున్నారనే ఆరోపణలున్నాయి.



అనంతపురంలోని జిల్లా పరిషత్ కార్యాలయం

కానరాని అభివృద్ధి..

ఇన్‌చార్జ్ ఎంపీడీఓలుగా వ్యవహరిస్తున్న మండలాల్లో అభివృద్ధి పూర్తిగా కుంటుపడిందనే విమర్శలు ఉన్నాయి. పాలనపై కనీస అవగాహన లేకపోగా.. ఉపాధి నిధులు.. ఇతర అభివృద్ధి పనులకు సంబంధించిన అంశాల్లో భారీగా వాటాలు దండుకుంటున్నట్లు ఆరోపణలున్నాయి. ఈ అంశానికి సంబంధించి ఇప్పటికే జిల్లా పరిషత్ కార్యాలయానికి ఫిర్యాదులు కూడా అందాయి. కర్ణాటక సరిహద్దు మండలాల్లో పని చేసే ఒకరిద్దరు ఇన్‌చార్జ్ ఎంపీడీఓల తీరు మరీ వివాదస్పదంగా ఉన్నట్లు సమాచారం.

ఇన్‌చార్జ్ ఎంపీడీఓలున్న మండలాలు

పేరు	హోదా	రెగ్యులర్ డ్యూటీ	ఇన్‌చార్జ్ ఎంపీడీఓ బాధ్యతలు
ఎం.నందకిషోర్	ఏఓ	బ్రహ్మసముద్రం	బ్రహ్మసముద్రం
జి.ఎస్.రామచంద్ర	ఎంపీడీఓ	కంబదూరు	కళ్యాణదుర్గం
ఇ.లక్ష్మీశంకర్	ఈఓఆర్‌డీ	కుందుర్పి	కుందుర్పి
కె.ఆజాద్	ఎంపీడీఓ	బొమ్మనహాళ్	డి.హీరేహాళ్
కె.రఘురామరావు	ఈఓఆర్‌డీ	శెట్టూరు	శెట్టూరు
బి.వి.రవిప్రసాద్	ఎంపీడీఓ	వజ్రకరూరు	ఉరవకొండ
ఎ.వి.రమణమూర్తి	ఏఓ	చిలమత్తూరు	చిలమత్తూరు
జి.అంజినప్ప	ఈఓఆర్‌డీ	నంబులపూలకుంట	నంబులపూలకుంట
డి.రామారావు	ఎంపీడీఓ	అమరాపురం	రొళ్ల
కె.రామానాయక్	ఏఓ	తలుపుల	తలుపుల
పి.రెడ్డెప్ప	ఏఓ	తనకల్లు	తనకల్లు
జి.గంగాధర్	ఏఓ	గుడిబండ	గుడిబండ
కె.ఓ.శ్రీధర్‌రావు	ఈఓఆర్‌డీ	పరిగి	పరిగి
ఎల్.రామ్‌కుమార్	ఏఓ	రొద్దం	రొద్దం
ఎ.జి.నటరాజ్	ఈఓఆర్‌డీ	కొత్తచెరువు	కొత్తచెరువు
డి.రాబర్ట్‌విల్సన్	ఎంపీడీఓ	ఓ.డి.చెరువు	నల్లమాడ
ఎస్.అనిల్‌కుమార్	ఈఓఆర్‌డీ	కనగానపల్లి	కనగానపల్లి
బి.వాసుదేవరెడ్డి	ఏఓ	యల్లనూరు	యల్లనూరు

కఠిన చర్యలు తప్పవు

ఉమ్మడి జిల్లాలో 18 మండలాలకు రెగ్యులర్ ఎంపీడీఓలు లేని మాట వాస్తవం. అక్కడ పాలనాపరమైన ఇబ్బందులు తలెత్తకుండా ఏఓలు, ఈఓఆర్‌డీలనే ఇన్‌చార్జ్‌లుగా నియమించాం. మరి కొన్ని చోట్ల రెండేసి మండలాలకు ఒకరికి అదనపు బాధ్యతలు అప్పగించాం. ఇదే విషయాన్ని రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాం. రిక్రూట్‌మెంట్ జరిగితే రెగ్యులర్ ఎంపీడీఓలు వస్తారు. ఒకరిద్దరిపై ఎప్పటి నుంచో ఆరోపణలు ఉన్నాయని మా దృష్టికి వచ్చింది. అలాంటి వారు పని తీరు మార్చుకోవాలి. లేకపోతే కఠిన చర్యలు తప్పవు.



– వెంకట సుబ్బయ్య, జెడ్పీ డిప్యూటీ సీఈఓ

ఐఆర్ 30 శాతం ప్రకటించాలి

- వైఎస్సార్‌టీఏ నాయకుల డిమాండ్

అనంతపురం ఎడ్యుకేషన్: ఉద్యోగ, ఉపాధ్యాయులకు సంబంధించి పీఆర్సీ కమిషన్ వేయడం మరింత ఆలస్యమవుతున్నందున తక్షణమే 30 శాతం ఐఆర్ ప్రకటించాలని కూటమి ప్రభుత్వాన్ని వైఎస్సార్ టీచర్స్ అసోసియేషన్ (వైఎస్సార్‌టీఏ) నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం నగరంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వైఎస్సార్‌టీఏ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నాగిరెడ్డి, శ్రీధర్‌గౌడ్ మాట్లాడారు. 2019లో వైఎస్ జగన్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే 27 శాతం ఐఆర్ ప్రకటించి ఉద్యోగ, ఉపాధ్యాయులకు అండగా నిలిచిందని గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఆర్నెళ్లవుతున్నా పీఆర్సీ కమిషన్ వేయలేదన్నారు. కనీసం ఐఆర్ కూడా ప్రకటించలేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి వెంటనే 30 శాతం ఐఆర్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో వైఎస్సార్‌టీఏ నాయకులు వెంకటరమణప్ప, గోవిందరెడ్డి, కృష్ణారెడ్డి, రవీంద్రరెడ్డి, రామకృష్ణ, కృష్ణానాయక్, వెంకటరెడ్డి, గోపాల్ పాల్గొన్నారు.

‘అపుస్మా’ రాష్ట్ర కమిటీలో జిల్లాకు కీలక పదవులు



రాష్ట్ర కమిటీలో చోటు దక్కించుకున్న బాబు, కుసుమ పుల్లారెడ్డి, నాగార్జున

అనంతపురం ఎడ్యుకేషన్: ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ అన్ ఎయిడెడ్ స్కూల్స్ మేనేజ్‌మెంట్స్ అసోసియేషన్ (అపుస్మా) రాష్ట్ర కమిటీలో జిల్లా వాసులు కీలక పదవులు దక్కించుకున్నారు. ఆదివారం గుంటూరులో అపుస్మా రాష్ట్ర కమిటీ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్ర నూతన కమిటీని ఎన్నుకున్నారు. రాష్ట్ర చీఫ్ కోఆర్డినేటర్‌గా జిల్లా మాజీ అధ్యక్షుడు కుసుమ పుల్లారెడ్డి (అనంతపురం), రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా బాబు (కళ్యాణదుర్గం), లీగల్ అడ్వయిజర్‌గా కె.నాగార్జున (గుంతకల్లు)ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా వాసులకు కీలక పదవులు దక్కడంపై జిల్లా అపుస్మా సభ్యులు, ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు హర్షం వ్యక్తం చేశాయి.

ట్రాక్టర్ బోల్తా - పలువురికి గాయాలు

గార్లదిన్నె: ట్రాక్టర్ బోల్తాపడిన ఘటనలో పలువురు గాయపడ్డారు. పోలీసులు తెలిపిన మేరకు... గార్లదిన్నె మండలం కమలాపురం, కొట్టాలపల్లికి చెందిన 12 మంది వ్యవసాయ కూలీలు ఆదివారం ఉదయం ఓ రైతు తోటలో రసాయన ఎరువుల మందు వేయడానికి వెళ్లారు. అక్కడ పని ముగించుకుని మరో తోటలో కూలి పనులకు పెనకచెర్ల వైపు ట్రాక్టర్‌లో బయలుదేరారు. కమలాపురం క్రాస్ వద్ద హెచ్చెల్సీ బ్రిడ్జి దాటిన తర్వాత మలుపు వద్ద ఉన్నఫళంగా పెనకచెర్ల వైపు నుంచి వేగంగా వచ్చిన ద్విచక్ర వాహనదారుడిని తప్పించే క్రమంలో స్టీరింగ్ అదుపు తప్పి ట్రాక్టర్ రోడ్డు పక్కనే ఉన్న పల్లంలోకి దూసుకెళ్లడతో ట్రాలీ ఓ పక్కకు వాలింది. దీంతో ట్రాలీలు ఉన్న కూలీలు, రసాయనిక మందుల మూటలు కిందపడ్డారు. ఘటనలో ఉమాదేవి, సావిత్రి, లక్ష్మీదేవి, రాధమ్మ, బసుంబీకు తీవ్రగాయాలయ్యాయి. రమాదేవి, ఖాసీంబీ, రాజమ్మ, జయలక్ష్మి, నిర్మల స్వల్ప గాయాలతో బయటపడ్డారు. స్థానికులు వెంటనే అప్రమత్తమై క్షతగాత్రులను కారులో అనంతపురంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ఘటనపై పోలీసులు విచారణ చేపట్టారు.

యాడికి కానిస్టేబుల్‌కు అవార్డు



విష్ణుభగవాన్

యాడికి: అరుదైన పురాతన నాణేలు సేకరిస్తున్న వారిని ప్రోత్సహించేలా గుజరాత్‌కు చెందిన పురాతన నాణేల పరిశోధన సంస్థ అందజేస్తున్న చాంపియన్ ఆఫ్ వరల్డ్ రికార్డు అవార్డుకు యాడికి పీఎస్‌లో పనిచేస్తున్న కానిస్టేబుల్ విష్ణు భగవాన్ ఎంపికయ్యారు. ఏటా దేశ వ్యాప్తంగా 10మందిని ఎంపిక చేసి సంస్థ తరపున అవార్డులను అందజేస్తుంటారు. ఈ ఏడాది ఎంపికైన వారిలో ఏపీ తరపున విష్ణుభగవాన్ ఉన్నారు. ఈ మేరకు ఆదివారం ఆ సంస్థ నుంచి విష్ణు భగవాన్‌కు సందేశం అందింది. ఈ నెల 31న గుజరాత్‌లో జరిగే కార్యక్రమంలో ఆయనకు అవార్డును అందజేయనున్నారు. కాగా, అవార్డుకు ఎంపికైన కానిస్టేబుల్‌ను సీఐ ఈరన్న, ఎస్‌ఐ రమణ, సిబ్బంది ఆదివారం అభినందించారు.

కురుబ ఉద్యోగుల సంఘం నూతన కమిటీ ఎంపిక



ఆర్వేటి పద్మావతి



ఎం.నాగరాజు

పెనుకొండ: ఉమ్మడి అనంతపురం జిల్లా కురుబ ఉద్యోగుల సంక్షేమ సంఘం నూతన కార్యవర్గాన్ని ఆదివారం పెనుకొండలో ఎంపిక చేసారు. జిల్లాలోని అన్ని నియోజకవర్గాల కురుబ ఉద్యోగుల సంఘం ప్రతినిధులు హాజరయ్యారు. ఉమ్మడి జిల్లా అధ్యక్షురాలిగా ఆర్వేటి పద్మావతి (అగ్రికల్చర్ డిపార్ట్‌మెంట్), ప్రధాన కార్యదర్శిగా మంగళకుంట నాగరాజు (ఎడ్యుకేషన్ డిపార్ట్‌మెంట్)ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికైన వారిని మంత్రి సవిత సన్మానించి, అభినందించారు.

బంగారం అపహరించే ముఠా అరెస్ట్



ముఠా సభ్యుల అరెస్టు వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ వెంకటేశ్వర్లు

గోరంట్ల: బ్యాంకు రుణాలు, పింఛన్లు మంజూరు కోసం ఫొటోలు తీసుకునే పేరుతో అమాయకుల ఒంటిపై ఉన్న బంగారు నగలను చాకచక్యంగా అపహరించుకుపోయే ముగ్గురు సభ్యులు గల ముఠాను గోరంట్ల పోలీసులు అరెస్ట్ చేశారు. ఇందుకు సంబంధించిన వివరాలను ఆదివారం గోరంట్ల స్టేషన్‌లో డీఎస్పీ వెంకటేశ్వర్లు మీడియాకు వెల్లడించారు. లేపాక్షి మండలానికి చెందిన సింహాద్రి, శ్రీహరి, శివ సులువుగా డబ్బు సంపాదించడం కోసం ఒక ముఠాగా ఏర్పడ్డారు. వీరు ఇటీవల గోరంట్ల మండలంలోని పలు గ్రామాల్లో తిరుగుతూ వృద్ధులు, పేద మహిళలను ఎంచుకుని వారికి ప్రైవేట్ బ్యాంకుల్లో రుణాలు ఇప్పిస్తామని, పింఛన్లు మంజూరు చేయిస్తామని నమ్మించారు. ఫొటో కోసం ఇంటి నుంచి బయటకు పిలిపించి.. ఒంటిపై బంగారు ఆభరణాలు ఉంటే లోన్లు, పింఛన్లు రావని చెప్పి.. చైన్లు, కమ్మలు, జుంకీలు తదితర వస్తువులను తీయించి చాకచక్యంగా అపహరించుకుపోయారు. పలువురు బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ శేఖర్ ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది ఆదివారం ముఠా సభ్యులను అరెస్టు చేశారు. వీరి వద్ద నుంచి 12 తులాల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం వీరిని పెనుకొండ మెజిస్ట్రేట్ ముందు హాజరు పరిచారు. అపరిచిత వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని డీఎస్పీ ఈ సందర్భంగా ప్రజలకు సూచించారు.

చీనీ చెట్లు దగ్ధం

గార్లదిన్నె: అగ్ని ప్రమాదంలో చీనీ చెట్లు దగ్ధమయ్యాయి. గార్లదిన్నెకు చెందిన రైతు సుధీర్‌రెడ్డి తన తోటలో ఏడాది వయస్సున్న చీనీ చెట్ల సాగు చేపట్టారు. ఈ క్రమంలో ఆదివారం మంటలు వ్యాపించడంతో దాదాపు 30 చీనీ చెట్లు, డ్రిప్ పరికరాలు కాలిపోయాయి. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

మాకొద్దు ఈ భోజనం



వంట మనిషి పత్తా లేకపోవడంతో సొంతంగా వడ్డించుకుంటున్న విద్యార్థులు

- అర్ధాకలితో అలమటిస్తున్న ఎస్సీ బాలుర హాస్టల్ విద్యార్థులు
- ఉడకని అన్నంలోకి కారం కలుపుకుని తింటున్న వైనం
- పట్టించుకోని అధికారులు

స్పందించని ఏఎస్‌డబ్ల్యూఓ..

స్థానికుల నుంచి సమాచారం అందుకున్న ‘సాక్షి’ అక్కడకు చేరుకుని హాస్టల్ విద్యార్థులు దీనవస్థను క్షేత్రస్థాయిలో పరిశీలించింది. తమ వెతలు చెప్పుకోలేక విద్యార్థులు కన్నీటి పర్యంతమయ్యారు. విషయాన్ని వెంటనే ఏఎస్‌డబ్ల్యూ దామోదర్‌రెడ్డి దృష్టికి ‘సాక్షి’ తీసుకెళ్లింది. విద్యార్థులతో నేరుగా ఫోన్ ద్వారా మాట్లాడించింది. అయినా సమస్య పరిష్కారానికి ఏఎస్‌డబ్ల్యూఓ ఎలాంటి చర్యలు తీసుకునేది స్పష్టత ఇవ్వలేదు. పైగా ‘నేను వార్డన్‌తో మాట్లాడుతా’ అంటూ ఫోన్ కట్ చేశారు. దీంతో అక్కడే ఉన్న స్థానికులు కొందరు అసహనానికి గురయ్యారు. దళితులంటే మరీ ఇంత చిన్నచూపు చూస్తారనుకోలేదని, ఇప్పటికైనా అధికారుల తీరు మారాలంటూ వ్యాఖ్యానించారు.

శెట్టూరు: స్థానిక ఎస్సీ బాలుర వసతి గృహం విద్యార్థుల పరిస్థితి చాలా దయనీయంగా మారింది. ఒకటి... రెండు రోజులు కాదు... వసతి గృహంలో చేరినప్పటి నుంచి అర్ధాకలితో అలమటిస్తున్నారు. ఆదివారం హాస్టల్ పరిసరాల మీదుగా వెళుతున్న వారు అక్కడ రాసిగా పడేసిన అన్నం, పప్పును గమనించి విద్యార్థులతో ఆరా తీయడంతో అసలు విషయం వెలుగుచూసింది.

కనిపించని మెను..

ఎస్సీ బాలుర వసతి గృహంలో ప్రభుత్వం ప్రకటించిన మెను ఏనాడూ అమలు కావడంలేదు. ఉడకని అన్నం, పప్పు, రసం పేరుతో రంగు నీళ్లు తినలేక విద్యార్థులు వాటిని బయటపడేస్తున్నారు. ఆకలిని తట్టుకోలేని మరికొందరు అప్పటికప్పుడు కొన్ని ఎండు మిరపకాయలు, ఎర్రగడ్డలు దంచి ఉడకని అన్నంలోకి కలుపుకుని తింటున్నారు. వాస్తవానికి ఆదివారం హాస్టల్ మెను ప్రకారం బిరియాని, గోంగూర పచ్చడి, మజ్జిగ వండి పెట్టాలి. అయితే ఈ వంటకాలు చేయలేదు. అంతేకాక మధ్యాహ్నం 2 గంటలవుతున్నా... భోజనం గురించి ఎవరూ పట్టించుకోకపోవడంతో ఆకలి మీద ఉన్న విద్యార్థులు చివరకు వంట గది వద్దకెళ్లి చూశారు. అక్కడ ఎవరూ కనిపించలేదు. చివరకు ఉదయం ఎప్పుడో వండి పెట్టిన పాత్రల్లోని ఉడకని అన్నం, బాళ్లుబాళ్లుగా ఉన్న పప్పును ప్లేట్లలో తామే వడ్డించుకుని భోజనానికి కూర్చొన్నారు. ఓ ముద్ద నోట్లోకి పెట్టుకోగానే తినలేక పోయిన కొందరు విద్యార్థులు వాటిని నేరుగా బయటపడేశారు. మిగిలిన కొందరు వంట గదిలోకి వెళ్లి ఎండు మిరపకాయలు, ఎర్రగడ్డలు తీసుకుని అప్పటికప్పుడు నూరుకుని అన్నంలోకి కలుపుకుని తిన్నారు.

అధికారులు ఎవరూ వచ్చినా మారని తీరు..

శెట్టూరులోని ఎస్సీ హాస్టల్‌లో 160 మంది విద్యార్థులు ఉన్నారు. ఇందులో ఆదివారం 120 మంది ఉన్నట్లు హాజరులో చూపించారు. కర్ణాటక సరిహద్దు ప్రాంత కావడంతో నిరుపేద పిల్లలు అత్యధికంగా హాస్టల్లో ఉంటూ చదువుకుంటున్నారు. ఒక్కో విద్యార్థి భోజనానికి రోజూ రూ.46 చొప్పున ప్రభుత్వం ఖర్చు చేస్తోంది. గతంలో ఆరోపణలు వెల్లువెత్తిన నేపథ్యంలో ఈ హాస్టల్‌ను అప్పటి కలెక్టర్ గౌతమి తనిఖీ చేశారు. కూటమి సర్కార్ ఏర్పాటైన తర్వాత అప్పటి జేసీ కేతన్‌గార్గ్ సైతం తనిఖీ చేశారు. హాస్టల్ మౌలిక సదుపాయల కల్పనకు రూ.10 లక్షల నిధులు విడుదల చేశారు. అయినా హాస్టల్ గోడలకు రంగులు తప్పా ఏ పరిస్థితీ మారలేదు. అపరిశుభ్రంగా ఉన్న మరుగుదొడ్లలోకి కాలు కూడా పెట్టలేకపోతున్నారు. హాస్టల్‌లో ఎక్కడేగాని పరిశుభ్రత అనేది మచ్చుకైనా కనిపించడం లేదు. నెలల తరబడి హాస్టల్ గదులు, పరిసరాలను శుభ్రం చేయడం లేదని అక్కడి పరిస్థితులను బట్టి అర్థమవుతోంది. ఇక నాణ్యమైన రుచికరమైన భోజనం అనేది ఎలా ఉంటుందో కూడా తమకు తెలియదని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లా ఉన్నత అధికారులు తనిఖీలు చేసినా... తమ పరిస్థితులు మారలేదంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి హాస్టల్ పరిస్థితులు మార్చాలని వేడుకుంటున్నారు.



ఉడకని అన్నం, పప్పు తినలేక మిరపకాయల కారం కలుపుకుంటున్న దృశ్యం

క్లుప్తంగా

అమిత్‌షా వ్యాఖ్యలు హేయం



మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు బాల రంగయ్య

రాప్తాడు: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షాను వెంటనే బర్తరఫ్ చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు బాల రంగయ్య, సీపీఎం రాప్తాడు ప్రాంతీయ కార్యదర్శి టి.రామాంజనేయులు డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక సీపీఐ కార్యాలయంలో సీపీఐ, సీపీఎం నాయకులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అమిత్‌షా వ్యాఖ్యలకు నిరసనగా ఈనెల 30న నిర్వహించే నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. పార్లమెంట్‌లో అంబేడ్కర్‌ను తక్కువ చేసి మాట్లాడటం సరికాదన్నారు. నిరసన కార్యక్రమాల్లో అంబేడ్కర్ అభిమానులు, ప్రజాస్వామిక వాదులు పాల్గొనాలన్నారు. కార్యక్రమంలో నాయకులు పోతులయ్య, సుబ్బిరెడ్డి, ధనుంజయ, చలపతి, నారాయణ స్వామి తదితరులు పాల్గొన్నారు.

దేశ సమైక్యత వెల్లివిరియాలి



కరపత్రాలు పంపిణీ చేస్తున్న సీపీఎం నాయకులు

అనంతపురం అర్బన్: నూతన సంవత్సరంలో దేశ సమైఖ్యత, మత సామరస్యం వెల్లివిరియాలని సీపీఎం నాయకులు అన్నారు. నూతన సంవత్సరానికి స్వాగతం పలుకుదామంటూ ఆదివారం స్థానిక సైఫుల్లా బ్రిడ్జి వద్ద కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నగర కార్యదర్శి రామిరెడ్డి మాట్లాడుతూ.. నూతన సంవత్సరంలో ప్రతి కుటుంబం సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలతో ఉండాలన్నారు. స్వేచ్ఛ, సామరస్యం, సమానత్వం ప్రజల మధ్య నెలకొన్నప్పుడే ఏ అభివృద్ధికైనా ప్రయోజనం, సుస్థిరత తోడవుతాయన్నారు. నిజమైన ప్రజాస్వామ్యానికి అర్థం కూడా ఇదే అన్నారు. సాటి వారిని అంటరాని వారిగా పరిగణించే అమానవీయ ఆచారాలు, స్త్రీలను తక్కువగా చూస్తూ అత్యాచారాలు, వేధింపులకు గురిచేసే పురుషాధిక్య ధోరణలు, అనాగరికమైన మూఢ విశ్వాసాలు నేటికీ కొనసాగుతున్నాయన్నారు. ఇవన్నీ ప్రగతికి ఆటంకాలన్నారు. సమైక్యతకు విఘాతం కలిగించే విద్వేషపూరిత భావోద్వేగాలను దరిచేరనీయవద్దని సూచించారు. కార్యక్రమంలో నాయకుల ముత్తూజ, వెంకటనారాయణ, వలి, ఇర్ఫాన్, రాజు, వెంకటేష్, ఆదినారాయణ పాల్గొన్నారు.

ఔత్సాహిక కళాకారులకు అవార్డులు



ఔత్సాహిక కళాకారులకు అవార్డులు అందజేస్తున్న దృశ్యం

అనంతపురం కల్చరల్: క్రియేటివ్ కంటెంట్‌తో అనంత ఖ్యాతిని ద్విగుణీకృతం చేస్తున్న ఔత్సాహిక కళాకారులకు ఆదివారం ప్రోత్సాహక అవార్డులు అందజేశారు. ముడార్ డిజీ లిమిటెడ్ ఆధ్వర్యంలో ఆదివారం నగర శివారులోని ఓ ఫంక్షన్ హాలులో పారిశ్రామిక వేత్త ముడార్ సుధీర్ నేతృత్వంలో జరిగిన కార్యక్రమంలో సినీనటుడు గురుచరణ్, బుల్లితెర నటుడు డాక్టర్ హరిప్రసాద్, ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణుడు క్రియేటర్ కృష్ణ తదితరులు అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముడార్ సుధీర్ రూపొందించిన ప్రాక్సో యాప్‌ను ఆవిష్కరించారు. ఈ యాప్ యువతకు ఉపాధిని పెంపొందించేలా ఉంటుందని తెలిపారు. అంతకు ముందు చిన్నారి లాలిత్య నాట్యం అందరినీ ఆకట్టుకుంది. కార్యక్రమంలో సీనియర్ న్యాయవాది నామసేవ హరికృష్ణ, అనంత జిరసం అధ్యక్షుడు సాకే శ్రీహరి మూర్తి, ప్రముఖ కెమెరామెన్ పవన్ లింగాల, రహంతుల్లా, యువ అనలిస్టు ప్రణవ్ ముడార్ తదితరులు పాల్గొన్నారు.

పంపనూరులో పూజలు





అలంకరణలో సుబ్రహ్మణ్యేశ్వరుడు | పూజలందుకున్న మంజునాథుడు

ఆత్మకూరు: పంపనూరులోని సర్పరూప సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం విశేష పూజలు, పంచామృతాభిషేకాలు నిర్వహించారు. స్వామిని పట్టు వస్త్రాలు, బంగారు ఆభరణాలతో అలంకరించారు. స్వామి వారి బంగారు కవచాన్ని ఆలయం చుట్టూ మేళతాళాలతో ఊరేగించారు. ఆలయ ప్రాంగణంలో పెద్ద ఎత్తున కాలసర్పదోష నివారణ రాహుకేతు హోమాలు చేపట్టారు. భక్తులు జమ్మిచెట్టు వద్ద టెంకాయలు కొట్టి మెక్కులు తీర్చుకున్నారు. ఆలయంలోని మంజునాథ స్వామి, పార్వతీ దేవిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. అనంతరం మహా మంగళహారతి ఇచ్చారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేసి, అన్నదానం చేశారు.

క్యాష్ కొట్టు.. పోస్టింగ్ పట్టు



- కూటమి ప్రభుత్వంలో కోరుకున్న చోట కొలువు
- పోస్టింగ్ కోసం ఉన్నతాధికారులకు రూ.లక్షల్లో ముడుపులు
- మున్సిపాలిటీలో వివాదాస్పద ఉద్యోగులకు రెడ్‌కార్పెట్
- ప్రజాప్రతినిధుల సిఫార్సులతో అవినీతి అధికారులకు అందలం
- ఇంజినీరింగ్, టౌన్ ప్లానింగ్ విభాగంలో పలువురు అధికారుల చేరిక

అనంతపురం కార్పొరేషన్: కూటమి ప్రభుత్వంలో అనంతపురం నగరపాలక సంస్థ వివాదాలకు కేరాఫ్‌గా నిలుస్తోంది. ప్రజాప్రతినిధుల ఆశీస్సులుంటే ఎటువంటి ఉద్యోగులకైనా క్షణాల్లో పోస్టింగ్‌లు జరిగిపోతున్నాయి. అందులోనూ గతంలో తీవ్ర స్థాయిలో విమర్శలు తెచ్చుకున్న వారికి ప్రాధాన్యత ఇస్తుండటంతో ఇక అవినీతి, అక్రమాలకు ఆస్కారం ఇచ్చేందుకు పాలకులే పరోక్షంగా సహకరిస్తున్నట్లు సమాచారం. ఉద్యోగులు జాయిన్ అవ్వడానికి ప్రజాప్రతినిధుల ఆశీస్సులతో పాటు సదరు అధికారులకు భారీగా ఆదాయం సమకూరేలా చేశారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

టీడీపీ ప్రజాప్రతినిధి సిఫార్సుతో విధుల్లోకి..

గతంలో నగరపాలక సంస్థలో ఏఈగా పని చేసిన వ్యక్తిపై తీవ్రస్థాయిలో విమర్శలు రావడంతో పాటు కింది స్థాయి సిబ్బంది, పై అధికారులను లెక్క లేకుండా మాట్లాడే స్వభావం ఉండటంతో గుత్తికి బదిలీ చేశారు. కానీ ఇక్కడే తిష్ట వేయాలని అప్పట్లో ప్రయత్నించినా.. ఏఈ దురుసు స్వభావం, సిబ్బందిని దుర్భాషలాడే విధానంతో విసిపోయిన పాలకవర్గం.. సదరు ఏఈను సాగనంపింది. గుత్తిలో అయినా సక్రమంగా ఉన్నారా అంటే అదీ లేదు. అక్కడి పాలకులు సైతం ఏఈను ప్రభుత్వానికి సరెండర్ చేశారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటయ్యాక ప్రజాప్రతినిధుల ఆశీస్సులతో నగరపాలక సంస్థలో నిబంధనలకు విరుద్ధంగా పోస్టింగ్‌లు తెచ్చుకున్నారు. ఏఈ కూడా అదే అడ్డదారిలో టీడీపీ అర్బన్‌లోని ఓ కీలక ప్రజాప్రతినిధి ఆశీస్సులతో ఈఎన్‌సీ ద్వారా మళ్లీ అనంతపురానికే మకాం మార్చారు. ఏఈ ఆగడాలను చూసిన పాలకవర్గం విధుల్లోకి చేర్చుకోకూడదని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. కానీ చివరకు టీడీపీ ప్రజాప్రతినిధి సిఫార్సుతో ఏఈ విధుల్లోకి చేరారు. అత్యంత కీలకమైన పోస్టింగ్‌లో ఎన్ని అక్రమాలకు ఆస్కారం ఉంటుందో వేచి చూడాలి.

పాలకవర్గం ఆదేశాలు బేఖాతరు..

సదరు ఏఈతో పాటు టౌన్ ప్లానింగ్ అధికారులను చేర్చుకోకూడదని పాలకవర్గం చెప్పినా.. నగరపాలక సంస్థ అధికారులు ముడుపులతో వారిని తిరిగి విధుల్లోకి చేర్చుకున్నట్లు జోరుగా ప్రచారం సాగుతోంది. ఇటీవల కాలంలో నగరపాలక సంస్థలో డబ్బుంటే ఏ పని అయినా క్షణాల్లో జరిగిపోతుందన్న ప్రచారం జోరుగా సాగుతోంది.

మళ్లీ ఆమె వచ్చారు..!

నగరపాలక సంస్థలోని టౌన్ ప్లానింగ్ విభాగంలో ఓ మహిళా అధికారిణిపై గతంలో పెద్ద ఎత్తున విమర్శలు వెల్లువెత్తాయి. నగరంలో అనధికార నిర్మాణాల్లో సదరు అధికారి కీలకపాత్ర పోషించారన్న విమర్శలు ఉన్నాయి. నాన్ లేఅవుట్‌లో 14 శాతం ట్యాక్స్, కమర్షియల్ ప్రాంతాల్లో అదనపు పన్ను వసూళ్ల ఎగవేతలో నిర్మాణదారులకు సదరు అధికారిణి పరోక్షంగా సహకరించారు. ఇటీవల ఆమె పదోన్నతిపై వెళ్లి తిరిగి సొంత గూటికి చేరుకున్నారు. వాస్తవంగా ఈమె ఎక్కడ పోస్టింగ్ కావాలంటే అక్కడ తెచ్చుకునే సత్తా ఉందంటే ఏ స్థాయిలో పైరవీలు చేస్తోందో చెప్పాలిన పనిలేదు. ఇక నగరంలో అనధికార నిర్మాణాలకు అడ్డూ అదుపు లేకుండా పోతోందన్న చర్చ జరుగుతోంది. కింది స్థాయి సిబ్బంది సైతం సదరు అధికారిణి ధోరణితో విసుగెత్తి పోతున్నారు.

నేడు బహిరంగ వేలం

ఆత్మకూరు: పంపనూరులోని సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో సోమవారం సాయంత్రం 4 గంటలకు టెంకాయల విక్రయ హక్కులకు బహిరంగ వేలంపాట నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈఓ బాబు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్న వారు దేవదాయశాఖ నిబంధనలకు లోబడి వేలంలో పాల్గొనాలని సూచించారు.

ముగిసిన సిద్ధి గణపతి హోమం



పూర్ణాహుతి చేస్తున్న వేదపండితులు

అనంతపురం కల్చరల్: అనంత వేదికగా రెండు రోజులుగా శాస్త్రోక్తంగా సాగిన సిద్ధి గణపతి హోమం ఆదివారం ఘనంగా ముగిసింది. శ్రీపీఠం, చెన్నైకు చెందిన గుహానంద మండలి సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక రెండవ రోడ్డులో జరిగిన యాగానికి భక్తులు పోటెత్తారు. ఉదయం వాంఛా కల్పలత శ్రీవిద్యా గణపతి హోమం నిర్వహించారు. మొట్టమొదటి సారి ప్రత్యక్ష అష్ట గణపతి పూజలను కనుల పండువగా నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం మహాపూర్ణాహుతి కార్యక్రమాన్ని వేదపండితులతో పాటూ నిర్వాహకులు గోటేటి శ్రీనివాసరావు, శ్రీవిద్యానందనాథులు తదితరులు ఘనంగా నిర్వహించారు. వేద ఘోషతో మార్మోగిన స్థానిక రెండవ రోడ్డు శ్రీ పీఠం ప్రాంగణంలో మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం చేపట్టారు. దాదాపు రెండు వేలమందికి అన్న సంతర్పణ చేశారు. ధార్మిక కార్యక్రమాన్ని లోక సంక్షేమం కోసం నిర్వహించిన శ్రీపీఠం శిష్యబృందాలు, గురువులను ప్రత్యేకంగా అభినందించారు.

ఏకీకృత మార్కెట్ విధానం రద్దు చేయాలి



ధర్నా చేస్తున్న ఏపీ రైతు సంఘం నాయకులు

అనంతపురం అగ్రికల్చర్: కేంద్ర ప్రభుత్వం తీసుకొస్తున్న ఏకీకృత మార్కెట్ విధానాన్ని తక్షణం రద్దు చేసుకోవాలని సీపీఎం అనుబంధ ఏపీ రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక మార్కెట్ యార్డు ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ.. మార్కెట్లు, సంతలను ప్రైవేట్‌పరం చేయడానికి కేంద్ర ప్రభుత్వం కుట్ర చేస్తోందని విమర్శించారు. చిన్నపాటి సంతలపై కూడా ప్రధాని మోదీ ప్రభుత్వానికి కన్ను పడిందన్నారు. కార్పొరేట్ సంస్థలకు కొమ్ముకాసేలా రైతులకు సేవలు అందకుండా చేస్తోందని ఆరోపించారు. సంతలు, మార్కెట్లను అగ్రిబిజినెస్ సెంటర్లుగా మారుస్తామని, జాతీయ ఏకీకృత మార్కెట్ విధానం పేరుతో రూపొందించిన ఫ్రేమ్‌వర్క్‌లో స్పష్టం చేసిన కేంద్రం మార్కెట్లను ఆదానీ, అంబాలనీలకు కట్టపెట్టడానికి కుట్ర చేస్తోందన్నారు. దీని వల్ల భవిష్యత్తులో రైతులు, కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. రైతులకు నష్టం కలిగించే ఏకీకృత విధానం తక్షణం విరమించుకోవాలని డిమాండ్ చేశారు. లేకపోతే పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు రామకృష్ణారెడ్డి, వన్నూరప్ప, రంగారెడ్డి, ఓబులేసు, మహానందరెడ్డి, నాగరాజు, శ్రీనివాసులు, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర సాహిత్య అకాడమీ కార్యక్రమాలు భేష్



మాట్లాడుతున్న రాచపాలెం చంద్రశేఖర రెడ్డి

అనంతపురం కల్చరల్: రాయలసీమ కథలు, నవలల్లో బహుజన జీవిత మూలాలు కనిపిస్తాయని ప్రముఖ విమర్శకుడు ఆచార్య రాచపాలెం చంద్రశేఖరరెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక ఎన్జీఓ హోంలో విమలా శాంతి సాహిత్య సాంస్కృతిక సేవా సమితి, కేంద్ర సాహిత్య అకాడమీ న్యూఢిల్లీ సంయుక్త ఆధ్వర్యంలో ×రాయలసీమ సాహిత్యం –బహుజన జీవితం⁅ అంశంపై సదస్సు జరిగింది. ఈ సందర్భంగా రాచపాలెం మాట్లాడుతూ.. కేంద్ర సాహిత్య అకాడమీ సాహిత్య ప్రచారం కోసం నిర్వహించే కార్యక్రమాలను వివరించారు. బహుజన వాదం మరింత రావాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. సీనియర్ కథా రచయిత డాక్టర్ శాంతి నారాయణ మాట్లాడుతూ.. కేంద్ర సాహిత్య అకాడమీ నిర్వహిస్తున్న కార్యక్రమాలు ఎంతో గొప్పవన్నారు. వీటిని ఉపయోగించుకుంటూ అనంత సాహితీ సంస్థలు మరింత ముందుకు తీసుకెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. అలాగే డాక్టర్ పాదిలి నాగరాజు రాయలసీమ నవల బహుజన జీవితంపై, డాక్టర్ భావికాటి రాఘవేంద్ర రాయలసీమ కథ బహుజన జీవితం అనే అంశంపై, రాయలసీమ సాహిత్యంలో బహుజన జీవితంపై డాక్టర్ అంకె శ్రీనివాస్, రాయలసీమ కవిత్వంలో బహుజన జీవితంపై కొత్తపల్లి సురేష్ ప్రసంగించారు.

సంక్షిప్త సమాచారం

దివ్యాంగుల సమస్యలు పరిష్కరించాలి

అనంతపురం టవర్‌క్లాక్: దివ్యాంగుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని జిల్లా శారీరక దివ్యాంగ ఉద్యోగుల సంక్షేమ సంఘం రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి బాలరాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదురుగా ఉన్న సంఘం కార్యాలయంలో దివ్యాంగ ఉద్యోగుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో దివ్యాంగుల సమస్యలు పరిష్కారం కోసం నూతన కమిటీని ఎన్నుకోవడం జరిగిందన్నారు. జిల్లా అధ్యక్షురాలిగా నాగరత్న, ఉపాధ్యక్షుడిగా నారాయణ స్వామి ఎన్నుకున్నట్లు పేర్కొన్నారు.

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

రాప్తాడు: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ విజయకుమారి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని అర్జీదారులు కార్యాలయానికి వచ్చినప్పుడు సంబంధిత అధికారులు అందుబాటులో ఉండాలన్నారు. గైర్హాజరైన అధికారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

నేడు గ్యాస్ సిలిండర్ల పంపిణీ

రాప్తాడు: మండలంలోని బొమ్మేపర్తి, లింగనపల్లి, పుల్లరేవు, యర్రగుంట, గొందిరెడ్డిపల్లి, రామినేపల్లి, హంపాపురం, గొల్లపల్లి, మరూరు, ఎం.కృష్ణాపురం, ఎం.చెర్లోపల్లి, పాలవాయి, ఎం.బండమీదపల్లి, పర్వతదేవరపల్లి, ముక్తాపురం తదితర గ్రామాల్లోని భారత్ గ్యాస్ వినియోగదారులకు సోమవారం గ్యాస్ సిలిండర్లు పంపిణీ చేయనున్నారు. ఈనెల 30వ తేదీ వరకు భారత్, హెచ్‌పీ, ఇండేన్ గ్యాస్ బుక్ చేసుకున్న వినియోగదారులకు రాప్తాడులోని పాత ఎంపీడీఓ కార్యాలయం ఎదుట వంట గ్యాస్ సిలిండర్లను అందజేయనున్నారు. మరింత సమాచారం కోసం 08554-286777 (భారత్ గ్యాస్), 08554 246199 (హసిని ఇండేన్ పవన్ గ్యాస్), 08554-228789 (హనుమాన్ హెచ్‌పీ గ్యాస్)లో సంప్రదించవచ్చు.

లక్ష్య సాధనకు కృషి చేయండి



క్యాలెండర్‌ను విడుదల చేస్తున్న సర్వే శాఖ ఏడీ రూప్లానాయక్, తదితరులు



నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఆర్డీఓ కేశవనాయుడు

అనంతపురం అర్బన్: నూతన సంవత్సరంలో మరింత నూతనోత్సాహంతో సమష్టిగా పనిచేద్దామని సర్వే, భూ రికార్డుల శాఖ ఏడీ రూప్లా నాయక్ సిబ్బందికి సూచించారు. సర్వే, భూ రికార్డుల శాఖ ఉద్యోగుల సంఘం రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆదివారం సర్వే కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నూతన సంవత్సరంలో లక్ష్యాలను నిర్దేశించుకుని వాటిని అధిగమించేందుకు చిత్తశుద్ధితో పని చేయాలన్నారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర సంయుక్త కార్యదర్శి రత్నాకర్, జిల్లా అధ్యక్షుడు ప్రభాకర్, కార్యదర్శి బండి రఘునాథ్, సంయుక్త కార్యదర్శి అయూబ్ ఖాన్, కోశాధికారి బ్రహ్మనందం, తాలూకా కార్యదర్శులు, సభ్యులు పాల్గొన్నారు.

టైపిస్ట్, స్టెనోగ్రాఫర్ల సంఘం క్యాలెండర్, డైరీ ఆవిష్కరణ

అనంతపురం అర్బన్: నూతన సంవత్సరంలో లక్ష్యాలు నిర్దేశించుకుని మరింత బాధ్యతగా పనిచేద్దామని ఆర్డీఓ కేశవనాయుడు ఉద్యోగులకు సూచించారు. ఆదివారం స్థానిక కృష్ణ కళామందిర్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సంఘం రాష్ట్ర పధాన కార్యదర్శి రవికుమార్, ఏపీ జేఏసీ అమరావతి జిల్లా చైర్మన్ దివాకర్‌రావు, రెవెన్యూ ఉద్యోగుల సంఘం జిల్లా కార్యదర్శి సోమశేఖర్ పాల్గొని ఏపీ రాష్ట్ర టైపిస్టు, స్టెనోగ్రాఫర్ల సంఘం క్యాలెండర్, డైరీని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ బాధ్యత విధులు నిర్వర్తించి ప్రజల మన్ననలు పొందాలని సూచించారు. సంఘం అధ్యక్షుడు పీవీఎస్ ప్రసాద్ నేతృత్వంలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు బ్రహ్మానందరెడ్డి, మహమ్మద్ జాకీర్, కార్యనిర్వాహక కార్యదర్శి ప్రాణేష్‌రావు, రెవెన్యూ ఉద్యోగుల సంఘం నాయకులు పునీత్ బాబు, ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ..

అనంతపురం టవర్‌క్లాక్: స్థానిక బాలాజీ కళ్యాణ మంటపంలో రాయలసీమ బలిజ మహాసంఘం ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు శంకరయ్య ఆదివారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో మాజీ జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, రమేష్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

మలుపు.. ప్రమాదానికి పిలుపు



అంకాలమ్మ ఆలయం వద్ద ప్రమాదకరంగా ఉన్న మలుపు

ఆత్మకూరు: ఆత్మకూరు నుంచి పి.యాలేరు గ్రామానికి వెళ్లే దారిలో అంకాలమ్మ ఆలయం వద్ద ఉన్న మలుపు ప్రమాదకరంగా మారింది. ఆ మలుపు వద్ద ముళ్ల కంపలు పెరిగిపోవడంతో ఎదురుగా వచ్చే వాహనాలు కనబడటం లేదు. వేగంగా వస్తున్న వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. మలుపు వద్ద గుంతలు పెద్దగా ఉండి, దారికి అడ్డంగా ముళ్ల కంపల చెట్లు రావడంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. సంబంధిత అధికారులు స్పందించి గుంతలను పూడ్చాల్సిన అవసరం ఉంది. మలుపులో ముళ్ల కంపల చెట్లను తొలగిస్తే ప్రమాదాలు జరగవని స్థానికులు చెబుతున్నారు.

గొందిరెడ్డి పల్లిలో రేపు రెవెన్యూ సదస్సు

రాప్తాడు: భూ సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ఈనెల 31న మండలంలోని గొందిరెడిపల్లి గ్రామంలో రెవెన్యూ సదస్సు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ విజయకుమారి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. మండల స్థాయి అధికారులు, ప్రజా ప్రతినిధులు హాజరై కార్యక్రమాన్ని జయప్రదం చేయాలన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

విలువలతో కూడిన విద్య అవసరం



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న జేవీవీ నాయకులు

అనంతపురం కల్చరల్: శాస్త్రీయ దృక్పథం కలిగిన సమాజాన్ని నిర్మించాలంటే విద్యార్థులకు చిన్ననాటి నుంచే విలువలతో కూడిన విద్య అందించాలని జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ గేయానంద్, జేవీవీ గౌరవాధ్యక్షుడు ఆచార్య రాచపాలెం చంద్రశేఖరరెడ్డి అన్నారు. ఆదివారం జేవీవీ కార్యాలయంలో జనవిజ్ఞాన వేదిక నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యను కాషాయీకరించే ప్రయత్నం కొనసాగితే సమస్యలపై సరైన అవగాహన లేక రానున్న రోజుల్లో యువత చెడు మార్గంలో పయనిస్తారన్నారు. మూఢనమ్మకాలను ప్రోత్సహించే విద్య వద్దని సూచించారు. ఆచరణ సాధ్యమయ్యే జ్ఞానం అవసరమన్నారు. అంధ విశ్వాసాలను వ్యతిరేకించడానికి అందరూ బాధ్యత తీసుకోవాలని సూచించారు. అనంతరం జేవీవీ డైరీ, క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో జేవీవీ ప్రతినిధులు సాకే భాస్కర్, వెంకట్రామిరెడ్డి, లక్ష్మీనారాయణ, గాంగే నాయక్, జిలాన్ బాషా, రామిరెడ్డి, తిరుపాలు, ముత్యాలు తదితరులు పాల్గొన్నారు.

పిల్లల పండుగకు సన్నాహాలు



మాట్లాడుతున్న బాలోత్సవ్ కమిటీ చైర్‌పర్సన్ షమీమ్ షఫీ

అనంతపురం కల్చరల్: పిల్లల్లో నైతిక విలువలు, ఆత్మస్థైర్యం పెంచే విధంగా గత నాలుగేళ్లగా నిర్వహిస్తున్న పిల్లల పండుగను (బాలోత్సవ్) మరోసారి నిర్వహించేందుకు సన్నాహాలు ప్రారంభించారు. ఈ మేరకు ఆదివారం రాత్రి స్థానిక లలిత కళాపరిషత్తులో 5వ బాలోత్సవ్ ఆహ్వాన కమిటీని ఏర్పాటు చేశారు. కమిటీ చైర్‌పర్సన్ షమీమ్ షఫీతో పాటూ నిర్వాహకులు ఐద్వా సావిత్రి, ఆర్డీటీ సంస్థ చైర్మన్ తిప్పేస్వామి, లలిత కళాపరిషత్తు కార్యదర్శి పద్మజ, సామాజిక సేవాకార్యకర్త రవికాంత్ రమణ, నాట్యాచార్యులు పట్నం శివప్రసాద్, పల్లవి, ఎస్టీయూ రమణారెడ్డి, యూటీఎఫ్ కోనేశ్వరప్ప, జిలాన్ బాషా, లింగమయ్య, మెడికల్ రెప్స్ అసోసియేషన్ నాయకులు శ్రీనివాసులు తదితరులు ఆహ్వాన కమిటీ సభ్యులు సమావేశానికి హాజరై మాట్లాడారు. ఈ ఏడాది ప్రారంభంలో 160 పాఠశాలలు, 4 వేల మంది విద్యార్థులతో ఘనంగా బాలోత్సవాన్ని నిర్వహించామన్నారు. రానున్న కొత్త సంవత్సరం పిల్లల పండుగగా, మరచిపోలేని వేడుకగా చేయాలని తీర్మానించారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు సహకారమందించాలని కోరారు.

గర్భిణుల ఆరోగ్యంతో చెలగాటం



సర్వజనాస్పత్రిలోని ఆంటినేటల్-2వ వార్డులో ఓ బాక్స్‌లో డైట్ పడేసిన దృశ్యం

ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో రెసిడెన్షియల్ మెడికల్ ఆఫీసర్ల బాధ్యతారాహిత్యంతో గర్భిణులను హీనంగా చూస్తున్నారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. వాస్తవంగా గర్భిణులకు డైట్‌ను సకాలంలో అందించాలి. అటువంటి పరిస్థితి లేకుండా డైట్ నిర్వాహకులు ఓ బిన్‌లో డైట్ ఉంచి వెళ్లిపోతున్నారు. అందులోనూ నిషేధిత ప్లాస్టిక్‌లో వేడి పదార్థాలను చుట్టి గర్భిణుల ఆరోగ్యంతో చెలగాటం ఆడుతున్నారు. ఆదివారం సర్వజనాస్పత్రిలోని ఆంటినేటల్-2వ వార్డులో గర్భిణులకు డైట్ ఆలస్యంగా అందింది. పౌష్టికాహారంతో కూడిన డైట్‌ను సకాలంలో అందించడంలో సర్వజనాస్పత్రి అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. డైట్ నిర్వాహకుడికి ప్రతి నెలా రూ.లక్షల్లో బిల్లు చేస్తుంటారు. అటువంటిది ఇష్టారాజ్యంగా డైట్ ఇస్తున్నా.. సదరు కాంట్రాక్టర్‌కు అధికారులు వెన్నుదన్నుగా నిలుస్తుండటం సర్వత్రా విమర్శలకు దారి తీస్తోంది. గర్భిణులకు డైట్ పంపిణీలో అటు వైద్యులు, స్టాఫ్‌నర్సుల నిర్లక్ష్యం లేకపోలేదు. మెడిసిన్, ఆర్థో, ఈఎన్‌టీ, సర్జికల్, లేబర్ తదితర వార్డుల్లో డైట్ సిబ్బంది రోగులను కసురుకుంటున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. – అనంతపురం మెడికల్: